



EVENING EDITION

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

గురువారం

12-03-2026

పేజీలు: 02




## ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారు రా పోరీలు

### 'దీవాన' టీజర్ రిలీజ్

హర్షిత్ రెడ్డి, స్నేహ జంటగా తెరకెక్కుతున్న సినిమా దీవాన. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మాణంలో శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వంలో బ్యూటిఫుల్ లవ్ స్టోరీగా తెరకెక్కుతుంది దీవాన సినిమా. గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ సినిమా సమ్మర్ లో రిలీజ్ కానుంది. తాజాగా ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే దీవాన తెలంగాణ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతున్న లవ్ స్టోరీ గా తెలుస్తుంది. చస్తావరా ఆ పిల్లకు అనే డైలాగ్ తో టీజర్ మొదలయి ఒక ప్రేమకథకు సంబంధించిన విజువల్స్ చూపించి చివర్లో ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారు రా పోరీలు అనే డైలాగ్ తో సినిమాపై ఆసక్తి నెలకొల్పారు.



## రాజేంద్ర ప్రసాద్‌పై విశాల్ ఫైర్

సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు దక్షిణాది సినీ పరిశ్రమలో పెను సంచలనంగా మారాయి. 'కత్తి కాంతారావు జాతీయ అవార్డు' ప్రదానోత్సవంలో పాల్గొన్న ఆయన కాంతారావు గొప్పతనాన్ని కొనియాడే క్రమంలో తమిళ చిత్ర పరిశ్రమ దిగ్గజం, మాజీ ముఖ్యమంత్రి ఎం.జి. రామచంద్రన్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. కాంతారావు పేరు చెబితేనే ఎంజీఆర్ భయపడేవారని, ఆ సమయంలో ఆయన ప్రవర్తనను ఉద్దేశించి రాజేంద్ర ప్రసాద్ వాడిన పదజాలం వివాదాస్పదంగా మారాయి. అయితే ఈ వ్యాఖ్యలపై నటుడు, నడిగర్ సంఘం కార్యదర్శి విశాల్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించారు. రాజేంద్ర ప్రసాద్ లాంటి గౌరవనీయమైన సీనియర్ నటుడు, కోట్లాది మంది ఆరాధ్య దైవమైన ఎంజీఆర్ గారిని అంత తక్కువ చేసి మాట్లాడటం తనను షాక్‌కు గురిచేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మహానుభావుడిని పొగిడేందుకు మరొక మహానుభావుడిని కించపరచడం సరైన పద్ధతి కాదని విశాల్ హితవు పలికారు.




# స్విగ్గీ, జొమాటో బంద్!

## ఏపీలో హోటల్స్ సంచలన నిర్ణయాలు..!

అంతర్జాతీయంగా ఇరాన్ యుద్ధం సృష్టిస్తున్న ప్రకంపనలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని సామాన్యుడి కంచంపై పడుతున్నాయి. యుద్ధం కారణంగా ఎల్పీజీ (LPG) దిగుమతులు నిలిచిపోవడంతో దేశవ్యాప్తంగా కమర్షియల్ గ్యాస్ కొరత తీవ్రమైంది. ఈ సంక్షోభం ఏపీలోని ఆతిథ్య రంగాన్ని కుదిపేస్తోంది. రోజురోజుకీ గ్యాస్ లభ్యత తగ్గిపోతుండటంతో, భవిష్యత్తులో హోటళ్లను నడపడం కష్టమని భావించిన ఏపీ హోటల్స్ అసోసియేషన్ మరియు స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజయవాడలో అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో గ్యాస్ పొదుపు కోసం అత్యంత కఠినమైన మరియు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించడమే ఏకైక మార్గమని అసోసియేషన్ భావిస్తోంది. ఇందులో భాగంగా రేపటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రెస్టారెంట్లు మరియు హోటళ్లకు ప్రతి సోమవారం 'వీక్లీ హాలిడే' ప్రకటించాలని నిర్ణయించారు. వారానికి ఒకరోజు హోటళ్లను పూర్తిగా మూసివేయడం ద్వారా కొంతమేర గ్యాస్ ఆదా చేయవచ్చని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా, స్టార్ హోటళ్లలో స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ఆర్డర్లను త్వరలోనే నిలిపివేయనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ఆర్డర్ల వల్ల గ్యాస్ వినియోగం విపరీతంగా పెరుగుతోందని, ప్రస్తుత కొరత దృష్ట్యా వీటిపై ఆంక్షలు తప్పవని వారు పేర్కొన్నారు.మరోవైపు, పొరుగు రాష్ట్రం కర్ణాటక తరహాలోనే ఏపీలో కూడా కొన్ని హోటళ్లు కేవలం టీ, కాఫీలు మరి యు అతి తక్కువ గ్యాస్ అవసరమయ్యే పదార్థాల విక్రయాలకే పరిమితం కానున్నాయి. రాత్రి 10 గంటల తర్వాత రెస్టారెంట్లు మరియు స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను నడపడం వల్ల గ్యాస్ వృధా అవుతోందని, అందుకే పనివేళలను కుదించేలా ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని హోటల్ యజమానులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేయాలని, గృహ అవసరాల గ్యాస్ మాదిరిగానే కమర్షియల్ గ్యాస్‌ను కూడా ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేయాలని వారు కోరుతున్నారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజే యాలని అసోసియేషన్ నిశ్చయించు కుంది. ఆతిథ్య రంగాన్ని 'ప్రాధాన్యత రంగం'గా గుర్తించి, ఈ రంగంపై ఆధారపడిన వేలాది మంది కార్మికుల ఉపాధి దెబ్బతినకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. యుద్ధ ప్రభావం తగ్గేవరకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక వెసులుబాటు లభించకపోతే, రాష్ట్రంలోని మెజారిటీ హోటళ్లు శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉందని అసోసియేషన్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.



## ఏపీలో మరో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం

### ఆంధ్రప్రదేశ్ ఐటీ విద్య శాఖ మంత్రి నారా లోకేష్

ఏపీలో పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా, ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ క్యాప్‌జెమినీని రాష్ట్రానికి ఆహ్వానించింది. విశాఖపట్నంలో క్యాప్‌జెమినీ గ్లోబల్ సీఈవో ఐమాన్ ఇజ్జత్‌తో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ సమావేశమై కీలక చర్చలు జరిపారు. సుమారు 20 వేల మందికి ఉద్యోగాలు కల్పించే సామర్థ్యంతో విశాఖలో ఒక భారీ ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా లోకేశ్ ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో విశాఖపట్నం ఐటీ, డేటా సెంటర్ హబ్‌గా శరవేగంగా అభివృద్ధి చెందుతోందని లోకేశ్ వివరించారు. దేశంలోనే అతిపెద్దదైన గూగుల్ డేటా సెంటర్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని, ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మరో మూడు నెలల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్ర యం అందుబాటులోకి రానుండటంతో విశాఖ కు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతా యని అన్నారు. ఇక్కడ ఉన్న ప్రత్యేక ఐటీ ఎకోసిస్ట మ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ముకేశే నంబర్ 1



రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ హవా కొనసాగుతున్నది. 2026 సంవత్సరానికిగాను అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ విడుదల చేసిన దేశీయ శ్రీమంతుల జాబితాలో 99.6 బిలియన్ డాలర్ల వ్యక్తిగత సంపదతో రిలయన్స్ అధినేత తన తొలిస్థానాన్ని పదిలపరుచకున్నట్టు వెల్లడించింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 12 శాతం బలపడటంతో ఆయన వ్యక్తిగత సంపద పెరగడానికి దోహదం చేసిందని పేర్కొంది. అయినప్పటికీ ఆయన సంపద 100 బిలియన్ డాలర్లకు కొద్ది దూరంలో నిలిచిపోయారు. రెండో స్థానంలో అదానీ గ్రూపు చైర్మన్ గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్ల సంపదతో నిలిచారు. అంబానీ, అదానీల వ్యక్తిగత సంపద 14.7 బిలియన్ డాలర్ల మేర పెరిగినట్టు ఫోర్బ్స్ మ్యాగజైన్ వెల్లడించింది.



## మంత్రుల పనితీరుకు చంద్రబాబు రేటింగ్స్

ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రుల పనితీరుపై నిర్వహించిన సమీక్ష రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం మాటలతో కాకుండా, ఏ మంత్రి వద్ద ఫైళ్లు ఎంత వేగంగా క్లియర్ అవుతున్నాయనే అంశంపై సీఎం స్వయంగా 'గణాంకాలతో కూడిన రేటింగ్స్' ప్రకటించడం విశేషం. పాలనలో పారదర్శకత, వేగం పెంచడమే లక్ష్యంగా ఈ విశ్లేషణ సాగింది. ముఖ్యమంత్రి వెల్లడించిన నివేదిక ప్రకారం, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అందరికంటే వేగంగా ఫైళ్లను పరిష్కరిస్తూ మొదటి స్థానంలో నిలిచారు. ఆయన పనితీరుపై సీఎం ప్రశంసలు కురిపించారు. అచ్చెన్నాయుడు తర్వాత వరుసగా మంత్రులు నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉత్తమ రేటింగ్స్‌తో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇక ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ జాబితాలో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు.

## గ్యాస్ బుకింగ్ పేరుతో మోసాలు జాగ్రతగా ఉండలి అన్నా వీసీ సజ్జనార్



వంట గ్యాస్ సిలిండర్ల కొరత ఉందన్న ఆందోళనను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. గ్యాస్ బుకింగ్ కోసం ఆన్‌లైన్‌లో వెతికే అమాయకులే లక్ష్యంగా కొత్త తరహా మోసాలకు తెరతీశారు. తక్షణమే సిలిండర్ డెలివరీ చేస్తామంటూ, అదనపు సిలిండర్లు ఇస్తామంటూ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ప్రకటనలు ఇస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. వాట్సాప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా ఫేక్ వెబ్‌సైట్ లింకులను పంపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ముఖ్యంగా, ఆన్‌లైన్‌లో ముందుగా డబ్బులు చెల్లిస్తే గ్యారెంటీగా, అత్యవసరంగా గ్యాస్ సరఫరా చేస్తామని నమ్మబలికే సందేశాలు వస్తే అవి కచ్చితంగా సైబర్ మోసాలేనని ప్రజలు గ్రహించాలి. ఇలాంటి అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. సిలిండర్ బుకింగ్ లేదా ఆన్‌లైన్ చెల్లింపుల కోసం గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్లను లేదా అధీకృత గ్యాస్ ఏజెన్సీలను మాత్రమే ఆశ్రయించాలి.

## ఐసీసీ బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్ లో అభిషేక్ శర్మ



ఇటీవలే ముగిసిన పొట్టి ప్రపంచకప్‌లో విఫలమైనా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఐసీసీ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఐసీసీ బుధవారం ప్రకటించిన పురుషుల టీ20 ర్యాంకింగ్స్‌లో అతడు.. 875 రేటింగ్ పాయింట్లతో తొలి స్థానంలోనే కొనసాగుతున్నాడు. ఇక ఈ టోర్నీకి ముందు భారత జట్టుతో చేరిన ఇషాన్ కిషన్.. ప్రపంచకప్‌లో 317 రన్స్‌తో రెండు స్థానాలు మెరుగుపరుచుకుని రెండో స్థానానికి (871 పాయింట్లు) ఎగబాకాడు. ఫర్హాన్ (పాకిస్థాన్), సాల్ట్ (ఇంగ్లండ్), నిస్సాంక (శ్రీలంక) టాప్-5లో ఉన్నారు. బౌలర్ల జాబితాలో వరుణ్ చక్రవర్తి నంబర్ వన్ స్థానాన్ని కోల్పోయాడు. రషీద్ ఖాన్ టాప్ ప్లేస్‌లో నిలిచాడు. టాప్-10లో బుమ్రా ఆరోస్థానంలో ఉన్నాడు.



## ఆ హీరో వల్లే నా జీవితం మారిపోయింది

అందాల భామ మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం ఆచితూచి సినిమాలు చేస్తుంది. తెలుగు, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఈ అమ్మడు. మొన్నటివరకు తెలుగులో వరుసగా సినిమాలు చేసిన మృణాల్.. ఇప్పుడు సినిమాల స్పీడ్ తగ్గించింది. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ లోకి వచ్చింది మృణాల్. తెలుగులో సీతారామం సినిమాతో పరిచయం అయ్యింది. తొలి సినిమాతోనే ఈ అమ్మడు మంచి విజయాన్ని అందుకోవడంతో పాటు.. మృణాల్ నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఓ హీరో చెప్పిన మాటలు తన జీవితాన్నే మార్చేశాయని తెలిపింది మృణాల్. ఆ హీరో ఎవరో కాదు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. మృణాల్ మాట్లాడుతూ.. గతంలో తన శరీరం పై వచ్చిన విమర్శలకు చాలా బాధపడ్డాను అని.. ఆ విమర్శలను తట్టుకోలేక పోయేదాన్ని అని తెలిపింది.

EVENING EDITION
గురువారం | 12 మార్చి 2026
www.suryaa.com 4PM
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




చందానగర్‌లో 400ల గజాల పార్కును

# కాపాడిన హైడ్రా

శేరిలింగంపల్లి మండలం చందానగర్ పరిధిలోని భవానీపురంలో పార్కును హైడ్రా కాపాడింది. తమ కాలనీలోని 400ల గజాల పార్కు స్థలం కబ్జాకు గురౌతోందని భవానీపురం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు గతంలో పార్కు చుట్టూ ప్రహరీ నిర్మించి హద్దులు నిర్ధారించారన్నారు. ఆ ప్రహరీనే పునాదులుగా చేసి ఇల్లు కట్టడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు.

# వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థాపించి నేటికీ 15 వసంతాలు పూర్తి

మాజీ ముఖ్యమంత్రి జగన్ స్థాపించిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేటికీ 15 వసంతాలు పూర్తి చేసుకుని మార్చి 12వ తేదీన 16వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. 12.03.2011లో యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ పేరుతో వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన రాజకీయ పార్టీ , తక్కువ సమయంలోనే రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా తయారైంది. పార్టీని ప్రారంభించిన ఏడాదికే 17 అసెంబ్లీ, ఓ ఎంపీ స్థానాన్ని గెలుచుకున్న వైయస్ఆర్‌సీపీ..2014 మేలో జరిగిన ఎన్నికల్లో 67 స్థానాల్లో గెలిచి.. ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందింది. ఆ తర్వాత రైతు భరోసా యాత్ర, ఏపీకి ప్రత్యేక హోదాపై ఢిల్లీలో చేపట్టిన ధర్నాలతో పాటు ఇచ్ఛాపురం నుంచి ప్రజాసంకల్ప యాత్రకు శ్రీకారం చుట్టారు. వైయస్ఆర్ కాంగ్రెస్



పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు (మార్చి 12) ఉదయం 9:30 గంటలకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు.

# చమురు ధర 200 డాలర్లకు చేరే ప్రమాదం.. ప్రపంచానికి భారీ హెచ్చరిక!

ఇరాన్ చమురు హెచ్చరిక: మధ్యప్రాచ్యంలో జరుగుతున్న ఉద్రిక్తతలు మరియు గల్ఫ్ ప్రాంతంలో దాడుల కారణంగా, ఇరాన్ ముడి చమురు ధరలు బ్యారెల్‌కి $200 వరకు చేరవచ్చని ప్రపంచాన్ని హెచ్చరించింది.హార్ముజ్ జలసంధిలో షిప్పింగ్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడడంతో, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు కలకలం పడుతున్నాయి. అనేక దేశాలకు ముడి చమురు సరఫరా నిలిచిపోయిన నేపథ్యంలో పెట్రోల్, గ్యాస్ ధరలు మిక్కిలి పెరుగుతున్నాయి. ఇతర మార్గాల ద్వారా చమురు తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, ఇంకా పూర్తి స్థాయిలో ఫలితాలు లభించలేదు. ఈ సందర్భంలో ఇరాన్ హెచ్చరిక మరింత ఆందోళన కలిగిస్తోంది.

ఇరాన్ సైనిక హెచ్చరిక:ఇరాన్ సైనిక కమాండ్ ప్రతినిధి ఇబ్రహీం జోల్ఫాఖారీ పేర్కొన్నారు, "చమురు ధరలు ప్రాంతీయ భద్రతా పరిస్థితులపై ఆధారపడతాయి. అమెరికా, ఇజ్రాయెల్ వంటి దేశాలు ప్రాంతీయ స్థిరత్వాన్ని అస్థిరపరిచే





ప్రయత్నాలు చేస్తే, బ్యారెల్‌కి $200 దాకా ధరలు చేరవచ్చని ప్రపంచం సిద్ధంగా ఉండాలి." గల్ఫ్ ప్రాంతంలో మూడు నౌకలపై దాడులు జరుగుతున్నాయి. హార్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచానికి సరఫరా అయ్యే చమురు మొత్తం 20 శాతానికి క్షీణత ఏర్పడింది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ఇది 1970ల చమురు సంక్షోభం తర్వాత అత్యంత తీవ్ర పరిస్థితి.

★ఇంధన సరఫరా, మార్కెట్ ప్రభావం : విస్తరిస్తున్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల ప్రపంచ చమురు ధరలు, స్టాక్ మార్కెట్లు స్థిరంగా లేవు. ఇంధన సరఫరాకు ముప్పు ఉన్నందున, వాణిజ్యాలు మరియు పెట్టుబడిదారులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. ఇరాన్, ఇజ్రాయెల్ మరియు ఇతర మధ్యప్రాచ్య ప్రాంతాల్లో దాడులు కొనసాగుతుండటంతో, టెహ్రాన్‌లోని కొన్ని బ్యాంకులపై రాత్రి దాడులు కూడా జరిగినట్లు సమాచారం. సైనిక కమాండ్ ప్రజలకు కనీసం 1,000 మీటర్ల భద్రతా దూరాన్ని పాటించాలని సూచిస్తోంది.ఈ ఉద్రిక్తతలు కొనసాగుతుండటంతో, గ్లోబల్ ఇంధన మార్కెట్లు, చమురు ధరలు మరియు వాణిజ్య వాహన రవాణాను సకాలంలో గమనిస్తూ ముందస్తు చర్యలు తీసుకోవడం అత్యవసరం. హార్ముజ్ జలసంధిలో మరింత తీవ్రత ఏర్పడితే, ప్రపంచ ఇంధన సరఫరా మరియు మార్కెట్లపై గణనీయమైన ప్రభావం పడే అవకాశం ఉంది.

# హోటళ్లు, రెస్టారెంట్లకు తగ్గిన గ్యాస్ సరఫరా

నగరంలోని హోటళ్లలో ప్రస్తుతం ఎల్పీజీ కొరత ఏర్పడింది. గల్ఫ్ సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా చమురు సరఫరా దెబ్బతినడంతో కేంద్రం కమర్షియల్ సిలిండర్ల సరఫరాపై ఆంక్షలు విధించింది. దీనివల్ల నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు గ్యాస్ దొరకక అల్లాడుతున్నాయి. రంజాన్ మాసం కావడంతో హైదరాబాద్‌కే ప్రత్యేకమైన 'హలీం' మెనూ నుంచి తొలగించకుండా ఉండేందుకు ప్రముఖ రెస్టారెంట్ 'పిస్తా హౌస్' సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది.

గ్యాస్ సిలిండర్ల కొరతను అధిగమించేందుకు పిస్తా హౌస్ యాజమాన్యం తమ వంటశాలల్లో మళ్ళీ పాత కాలపు పద్ధతిలో కట్టెల పొయ్యిలను రంగంలోకి దించింది. అత్యాధునిక గ్యాస్ స్టౌల స్థానంలో పెద్ద పెద్ద కట్టె మోపులతో 'భట్టీ'లను ఏర్పాటు చేసి, హలీం మరియు ఇతర వంటకాలను సిద్ధం చేస్తోంది. గ్యాస్ లేదనే నెపంతో కస్టమర్లను నిరాశపరచకూడదని, సంప్రదాయ పద్ధతిలో కట్టెలపై వండటం వల్ల హలీం రుచి మరింత




పెరుగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. హోటల్ ఆవరణలో కట్టెల పొయ్యిలపై హలీం హండీలు ఉడుకుతున్న దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# కూల్‌డ్రింక్ అనుకుని పురుగుల మందు తాగిన చిన్నారి

ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం మర్రిగూడేనికి చెందిన పూనెం నాగేంద్రబాబుకు, అందర్వేదిగూడేనికి చెందిన కుమారికి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఐదేళ్ల కుమార్తె రితిక ఉన్నారు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్తను భయపెట్టి దారికి తెచ్చుకోవాలని భావించిన కుమారి, పొగాకు తోటలకు కొట్టే జిడ్డు మందును ఓ కూల్‌డ్రింక్ సీసాలో నింపి ఇంటి దగ్గరున్న కంచె వద్ద పెట్టింది.



మంగళవారం ఆ బాటిల్‌ను గమనించిన చిన్నారి రితిక, అందులో ఉన్నది కూల్‌డ్రింక్ అని భ్రమపడింది. ఎవరూ చూడని సమయంలో దాన్ని తాగేసింది. కొద్దిసేపటికే తీవ్రమైన కడుపునొప్పితో విలవిల్లాడటంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే బుట్టాయగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా యూరియా బస్తాలపై పెట్రోల్ పోసిన రైతులు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలానికి చెందిన కొందరు రైతులు ముస్తాబాద్ మండలం పోతుగల్ సొసైటీలో బుధవారం ఉదయం ఫర్టిలైజర్ యాప్ లో యూరియా బుక్ చేసుకున్నారు. యూరియా బుక్ చేసుకున్న రైతులు పోతుగల్ కు వెళ్తే ఇక్కడ లేదని ఆవునూరు గూడెం వెళ్లాలని చెప్పడంతో గూడెం సొసైటీ కి వెళ్లడంతో మా గ్రామానికి కాదని గంభీరావుపేట మండలానికి చెందిన రైతులకు యూరియా ఎలా ఇస్తారని రైతులు తీసుకున్న యూరియా బస్తాలపై పెట్రోల్ పోశారు.మా మండల రైతులకు కాదని ఇతర మండల రైతులకు యూరియా ఎలా ఇస్తారని రైతుల వాగ్వాదం. నిప్పంటిస్తామని వాగ్వివాదానికి దిగారు సుమారు గంటపాటు రైతుల ఘర్షణ



వాతావరణం నెలకొంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను శాంతింప చేసి బుక్ చేసుకున్న రైతులకు యూరియా అందించారు.యాప్ లో కాకుండా యూరియా నేరుగా రైతులకు ఇవ్వాలని కోరుకుంటున్న రైతులు.

# ఎలాంటి డిమాండ్లు చేయలేదు

హీరోయిన్ అనన్య పాండే ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారిన వర్కింగ్ అవర్స్ అంశంపై తాజాగా కొన్ని హాట్ కామెంట్స్ చేసింది. కరీనా కపూర్, కల్యాణి ప్రియదర్శన్‌లతో కలిసి ఆమె 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంది. ఈ క్రమంలో సినిమా షూటింగ్ లో వర్కింగ్ అవర్స్ గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలో అనన్య పాండే మాట్లాడుతూ.. 'దీపికా పదుకొణె అంకితభావం ఉన్న నటి. నేను ఆమెతో కలిసి పని చేశాను. అప్పుడు దీపిక ఎలాంటి డిమాండ్లు చేయలేదు.



# 28 నుంచి ఐపీఎల్




దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు బీసీసీఐ శుభవార్త చెప్పింది. వారం రోజుల ఉత్కంఠకు తెరదించుతూ ఐపీఎల్-2026 తొలిదశ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేసింది. ఇంతకుముందు ప్రకటించినట్టుగానే ఈనెల 28 నుంచి టోర్నీ మొదలవనుంది. డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ).. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మధ్య బెంగళూరు వేదికగా జరగబోయే మ్యాచ్‌తో 2026 సీజన్ ఆరంభమవనుంది. మార్చి 28 నుంచి ఏప్రిల్ 12 దాకా జరగనున్న తొలి దశ షెడ్యూల్‌లో పది జట్లు.. నాలుగేసి మ్యాచ్‌లు ఆడనున్నాయి. కాగా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా మొదటి దఫా షెడ్యూల్‌ను విడుదల చేసిన బీసీసీఐ.. ఎన్నికల తేదీ వచ్చాక పూర్తి షెడ్యూల్‌ను వెల్లడించే అవకాశముంది.16 రోజుల పాటు జరిగే ఫస్ట్ ఫేజ్ షెడ్యూల్‌లో ఆయా జట్లు.. తమ ప్రత్యర్థులతో నాలుగు మ్యాచ్‌లు ఆడతాయి. అయితే ఈసారి పది జట్లను రెండు గ్రూపులుగా విభజించడంపైనా స్పష్టత లేదు.



# ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకున్న మోనాలిసా

**భద్రతా కారణాలతో సొంత రాష్ట్రం వదిలి కేరళలో వివాహం**


మహాకుంభ్ మేళాలో తీయించుకున్న ఫొటోలతో రాత్రికి రాత్రే ఇంటర్నెట్ సెన్సేషన్‌గా మారిన మోనాలిసా తన చిరకాల ప్రియుడు ఫర్మాన్ ఖాన్‌ను పెళ్లాడారు. వీరిద్దరూ వేర్వేరు మతాలకు చెందిన వారు కావడంతో, వివాహం పట్ల వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని భావించి కేరళలోని ఒక ఆలయాన్ని వేదికగా చేసుకున్నారు. ఈ జంటకు ప్రాణహాని ఉందన్న సమాచారంతో కేరళ పోలీసులు వారికి పూర్తి స్థాయి భద్రత కల్పించారు. ఆలయ ప్రాంగణంలో పోలీసులు పహారా కాస్తుండగా హిందూ సంప్రదాయం ప్రకారం వీరి వివాహం అత్యంత సరళంగా జరిగింది. ఫర్మాన్ ఖాన్ కూడా ఈ వివాహానికి హిందూ పద్ధతులను అనుసరించడం విశేషం. మోనాలిసా తన పెళ్లి ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగానే నెటిజన్లు పెద్ద ఎత్తున స్పందించారు. కొందరు ఈ జంటను అభినందిస్తుండగా, మరికొందరు మిశ్రమంగా స్పందిస్తున్నారు. అయితే, తమ ప్రేమ గెలిచినందుకు సంతోషంగా ఉన్నామని, తమ నిర్ణయాన్ని గౌరవించాలని మోనాలిసా సోషల్ మీడియా ద్వారా కోరారు.




# భూత్ బంగ్లా' టీజర్ విడుదల

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ హారర్-కామెడీ చిత్రం 'భూత్ బంగ్లా'. సుమారు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'భూల్ భులైయా' వంటి క్లాసిక్ సినిమాను గుర్తు చేస్తూ, భయం మరియు నవ్వుల మేళవింపుతో ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మంగళపూర్ అనే గ్రామంలోని 'వధుసురుడు' అనే మిస్టరీ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా చిత్ర బృందం స్పష్టం చేసింది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్‌తో పాటు టబు, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, వామిఖ గబ్బి, మిథిలా పాల్కర్ వంటి భారీ తారాగణం నటిస్తుండగా, ప్రీతమ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్‌గా విడుదల కాబోతుంది.

# రెండేళ్లకే ముగిసిన వివాహ బంధం



ప్రముఖ సినీ నటి హన్సిక మోత్వానీ తన వైవాహిక బంధానికి ముగింపు పలికారు. వ్యాపారవేత్త సోహైల్ ఖతురియాతో ఆమె అధికారికంగా విడాకులు తీసుకున్నారు. కొంతకాలంగా వీరిద్దరూ విడిపోతున్నారంటూ వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ ముంబైలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టు ఈ జంటకు విడాకులు మంజూరు చేసింది. దీంతో వారి రెండేళ్ల వివాహ బంధం ముగిసినట్లయింది. 2022 డిసెంబర్‌లో హన్సిక, సోహైల్ వివాహం రాజస్థాన్‌లో అత్యంత వైభవంగా జరిగింది. అయితే, పెళ్లయిన కొద్ది కాలానికే ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయని ప్రచారం మొదలైంది. సోషల్ మీడియా ఖాతాల నుంచి హన్సిక తన పెళ్లి ఫొటోలను తొలగించడంతో ఈ వార్తలకు మరింత బలం చేకూరింది. 2024 జులై నుంచే వీరిద్దరూ వేర్వేరుగా ఉంటున్నట్లు సమాచారం.